# కైవల్యోపనిషత్తు

# [ అధర్వణ వేదం ]

వ్యాఖ్యాత

" అభినవ వ్యాస ", " జ్ఞాన ప్రపూర్ణ "

శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc[Ag]

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం :: చిలకలూరిపేట

Visit – WWW.SRICHALAPATHIRAO.COM

Contact : +91 80085 39770 / 08647 254716

+91 98862 65225

Sample : WWW.SRICHALAPATHIRAO.COM




ఈ ఉపనిషత్తు మంత్రములపై ప్రవచనములు వినడానికి, మంత్రములను చదివే విధానం తెలుసుకొనుటకు **http://www.srichalapathirao.com** ను దర్శించండి. లేదా CD కొరకు సంప్రదించండి.

**Andhra : +91 80085 39770**

**Karnataka : +91 9538858115**

Sample : www.srichalapathirao.com

## ఓం శ్రీగురుభ్యోనమః

# కైవల్యోపనిషత్తు - అథర్వణ వేదం

## తొలి పలుకు

సాధారణంగా మానవులను సామాన్యులు, ఉత్తములు, మహాత్ములు అని 3 తరగతులుగా విభజించవచ్చు.

(1) సామాన్యులు:- ఈ జన్మ బాగా గడిచిపోతే చాలు, తరువాత సంగతి ఎవరు చూడొచ్చారు? అని భావించి - శరీర పోషణ కొరకు, అవసరాల కొరకు, భోగాల కొరకు, తనయొక్క - తన వారియొక్క సుఖ సంతోషాల కొరకు ఏవేవో పనులు చేస్తూ, ఎలాగో ఒకలాగా జీవితాన్ని గడిపివేసేవారు సామాన్యులు.

(2) ఉత్తములు:- అలాగాకుండా, ఇప్పుడు ఈ జన్మలో మనం అనుభవిస్తున్న కష్టాలకు, సుఖాలకు, సంపదలకు, భోగభాగ్యాలకు కారణం మనం పూర్వ జన్మలలో చేసిన పాప పుణ్యాలే గనుక, మళ్ళీ మనం రాబోయే జన్మలలో మరింత సుఖ సంతోషాలతో, హాయిగా, ఆనందంగా, శ్రీమంతులుగా జీవించాలంటే ఇప్పుడు ఈ జన్మలో సత్కార్యాలు, పుణ్యకార్యాలు, దాన ధర్మాలు, పరుల శ్రేయస్సుకుపయోగించే పనులు చేయాలని భావిస్తూ, ఆవిధంగా జీవితాన్ని గడిపేవారు ఉత్తములు.

(3) మహాత్ములు:- ఇక అరుదుగా కొద్దిమంది మాత్రం - ఎన్ని సత్కార్యాలు, పుణ్యకార్యాలు, దానధర్మాలు చేసినా, వాటి కారణంగా ఎంత మంచి జన్మలు

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

లభించినా, శ్రీమంతులుగా జన్మించినా - ఆ జన్మలలో కూడా సుఖాలతో బాటు కొన్ని దుఃఖాలు, బాధలు, కష్టాలు తప్పవని, ముఖ్యంగా జన్మ దుఃఖం, మరణ దుఃఖం, అనుభవించక తప్పదని, ఏది తప్పినా గర్భ నరకం, మరణయాతన ఈ రెండింటినీ ఎవ్వరూ తప్పించుకోలేరని; కనుక వీటిని కూడా తప్పించుకొని అసలు దుఃఖమే లేని శాశ్వత ఆనందాన్ని పొందాలంటే అసలు జన్మలే రాకుండా చేసుకోవాలని; అందుకు జన్మ రాహిత్యం లేదా మోక్షాన్ని పొందటం ఒక్కటే ఏకైక ఉపాయం అని తెలుసుకొని మోక్షప్రాప్తి కొరకే ప్రయత్నం చేసేవారు, దానికోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడి పాటుబడేవారు మహాత్ములు. అనేక జన్మల పుణ్య ఫలం ఉంటేగాని ఇట్టి మోక్షాపేక్ష కలగదు, మోక్షం కొరకు ప్రయత్నించటం జరగదు. ఇటువంటివారు లోకంలో చాలా అరుదుగా కనిపిస్తారు.

మానవులుగా జన్మించినవారు సామాన్యులుగా జీవిస్తుంటే వారు ఉత్తములుగా మారాలి. ఉత్తములుగా జీవించేవారు మహాత్ములు కావాలి. అట్టి మహాత్ములే మాధవులౌతారు.

ఇలా మానవుడు మాధవుడుగా, నరుడు నారాయణుడుగా, జీవుడు దేవుడుగా తన స్వస్థితిలో నిలిచిపోవటానికి మార్గం చూపేవే వేదాలు. మానవుడు తరించటానికి కావలసిన సమస్తమైన విషయాలను తెలియజెప్పి, తరించేందుకు మార్గాన్ని చూపేవే చతుర్వేదాలు. 'వేద' అంటే తెలుసుకోవటం అని అర్థం. ఏమి తెలుసుకోవాలి? దేనిని తెలుసుకున్న తర్వాత ఇక తెలుసుకోవలసినది ఉండదో, దేనిని తెలుసుకుంటే సర్వమూ తెలిసినట్లో అట్టి జ్ఞానాన్ని - ఆత్మజ్ఞానాన్ని

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

తెలుసుకోవాలి. అట్టి జ్ఞానాన్ని అందించేదే 'వేదం'. కనుక మానవుడు తన జీవిత పరమార్ధాన్ని సాధించాలంటే, తన జన్మను సార్ధకం చేసుకోవాలంటే తప్పక తెలుసుకోవలసినదే ' వేదవిజ్ఞానం'.

దీనిని మొదట సృష్టికర్త బ్రహ్మదేవుడు 'దివ్యవాణి' గా విన్నాడు. అందుకే దీనిని 'శృతి' అన్నారు. శృతి అంటే విన్నది అని అర్ధం. బ్రహ్మదేవుడు విని ఇతరులకు బోధించటం వలన దీనిని బ్రహ్మవిద్య అన్నారు.

మొదట వేదమంత్రాలన్నీ కుప్పలు తెప్పలుగా ఒక్కటిగానే ఉన్నాయి. కృతయుగంలోను, త్రేతాయుగంలోను మానవుల ఆయుః ప్రమాణం వేల సంవత్సరాలుగా ఉండేది. అందువల్ల ఆ యుగాలలోని మానవులు అసంఖ్యాకంగా ఉన్న వేదమంత్రాలను తెలుసుకొనేందుకు తగిన సమయం వారికి ఉంది. పైగా వారు బుద్ధి సూక్ష్మత గల మేధా సంపన్నులు కూడా. కాని ద్వాపర యుగం వచ్చేసరికి మానవుల ఆయుః ప్రమాణం 200 సంవత్సరాలకు పడిపోయింది. ఇక కలియుగంలోనైతే మానవుని పూర్ణాయుర్దాయం వంద సంవత్సరాలే. అంతేకాకుండా ఈ రెండు యుగాలలోని మానవులు అల్పజ్ఞానులు కూడా. కనుక ఈ వేద మంత్రాలను చదవటానికి గాని, అధ్యయనం చేయటానికి గాని, వారికి తెలివితేటలు గాని, సమయం గాని లేవు. అందుకే ద్వాపర యుగంలో జన్మించిన వ్యాసమహర్షి ఒక్కటిగా ఉన్న ఈ వేదమంత్రాలను నాలుగుగా విభజించాడు. అవే 1. ఋగ్వేదం, 2. యజుర్వేదం, 3. సామవేదం, 4. అధర్వణ వేదం. అయితే ఎలా - ఏ ఆధారంగా విభాగించటం జరిగిందో తెలుసుకోవాలంటే ఒక్కొక్క వేదానికి ఉన్న





Sample : WWW.SRICHALAPATHIRAO.COM

అధిష్టాన దేవతను బట్టి గ్రహించవచ్చు. ఋగ్వేదానికి అధిష్టాన దేవత బ్రహ్మ, యజుర్వేదానికి విష్ణువు, సామవేదానికి ఈశ్వరుడు, అధర్వణ వేదానికి అధర్వుడు (నిరాకార, నిర్గుణ పరమాత్మ). దీనిని బట్టి సృష్టికి సంబంధించిన విషయాలు అధికంగా ఉండేది ఋగ్వేదం అని, స్థితికి (పోషణకు) సంబంధించిన విషయాలు అధికంగా ఉండేది యజుర్వేదం అని, లయానికి సంబంధించిన విషయాలు అధికంగా ఉండేది సామవేదం అనీ, అలాగే సంపూర్ణ జ్ఞాన సంబంధ విషయాలు అధికంగా ఉండేది అధర్వణ వేదం అనీ మనం గ్రహించవచ్చు. తిరిగి యజుర్వేదం కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం అని రెండుగా విభజించబడ్డాయి.

ఇలా విభజించబడిన ప్రతి వేదము అందలి విషయాలను బట్టి తిరిగి నాలుగు భాగాలుగా విభజించబడినది.

1. సంహిత :- దీనినే మంత్రభాగం అని కూడా అంటారు. ఇందులో ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ అనేక స్తోత్ర పాఠాలు ప్రధానంగా ఉంటాయి.

2. బ్రాహ్మణాలు :- దేవతలను కొలిచే, ప్రసన్నులను చేసుకొనే అనేక విధాలైన పూజాదికాలు, యజ్ఞయాగాదులు, కర్మకాండ ఇందులో ప్రధానంగా ఉన్నాయి.

3. ఆరణ్యకాలు :- ఇందులో భగవంతుని ఉపాసించే అనేక ఉపాసనా విధానాలు ప్రధానంగా చెప్పబడ్డాయి.

4. ఉపనిషత్తులు :- జీవుని యదార్థ తత్త్వం పరమాత్మయేనని చెప్పి, జీవబ్రహ్మైక్యస్థితిని కలిగించేందుకు కావలసిన సమస్త విషయాలను ఇందులో చెప్పటం జరిగింది. ఈ ఉపనిషత్తులను వేదాలకు శిరస్సులు అంటారు.

Sample WWW.SRICHALAPATHIRAO.COM

సంపూర్ణమైన ఆత్మజ్ఞానం, పరమాత్మతత్త్వం ఈ ఉపనిషత్తులలోని ప్రధాన విషయం. ఈ ఉపనిషత్తులు వేదాలకు అంతంలో ఉండటం వల్ల వీటిని **'వేదాంతం'** అని కూడా అంటారు. కనుక వేదాంతం అంటే ఉపనిషత్తులలో భద్రపరచబడినట్టి "ముక్తిని - మోక్షాన్ని- కైవల్యాన్ని ప్రసాదించే అద్భుత జ్ఞాన భాండాగారం" అని భావం.

మానవ జీవితాన్ని తరింపజేసుకొనుటకు, మోక్షాన్ని అందుకొనుటకు కావలసిన అద్భుత జ్ఞానాన్ని ప్రసాదించే ఉపనిషత్తులు నాలుగు వేదాలలోను మొత్తం 1180 ఉన్నాయని పెద్దలు చెబుతుంటారు. అయితే వాటి పేర్లు కూడా అన్నీ ఇప్పుడు లభించటం లేదు. మొత్తం మీద పండితులు పరిశోధనలు చేసి దాదాపు 350 ఉపనిషత్తుల పేర్లను కనుగొన్నారు. ఇవన్నీ తాళ పత్రాలలో ఉండటం వల్ల చాలా వరకు శిధిలమై పోయాయి. ఇందులో 108 ఉపనిషత్తులు మాత్రము సనాతనమైనవని, ముఖ్యమైనవని అందరూ అంగీకరిస్తున్నారు. ఇలా చెప్పటానికొక ఆధారం కూడా ఉన్నది. ముక్తికోపనిషత్తులో శ్రీరాముడు , "కైవల్యముక్తిని ఏ ఉపాయం ద్వారా పొందగలను." అని ప్రశ్నించిన, ఆంజనేయునితో, "ఆంజనేయా!

**"మాండూక్య మేకమేవాలం ముముక్షూణాం విముక్తయే"-**

ఒక్క మాండుక్యోపనిషత్తును బాగుగా అధ్యయనం చేసినచో సద్యోముక్తి - జీవన్ముక్తి కలుగుతుంది - అని చెప్పి, అప్పటికీ సరైన ఆత్మజ్ఞానం కలగనిచో దశోపనిషత్తులను చదివి ఆచరణలో పెట్టుకో. అలా కూడా ఆత్మజ్ఞానము

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

యొక్క గట్టితనం కుదరకపోతే 32 ఉపనిషత్తులను బాగుగా అధ్యయనం చేసి ఆచరణలోనికి తెచ్చుకో. ఒకవేళ ఇంకా దేహాభిమానం పోక, నిదిధ్యాసనం నిలువకపోతే, కైవల్యముక్తి కొరకు 'ఇదిగో ఈ 108 ఉపనిషత్తులను అధ్యయనం చేసి తెలుసుకో' అంటూ 108 ఉపనిషత్తుల పేర్లను, వాటి శాంతి మంత్రాలను తెలియజేయటం జరిగింది. ఆవిధంగా 108 ఉపనిషత్తులు లోకంలో ప్రచారానికి వచ్చినవి. ఐతే ఈ 108 ఉపనిషత్తులలోను దశోపనిషత్తులనే 10 ఉపనిషత్తులు అత్యంత ముఖ్యమైనవని మహాత్ములందరూ అంగీకరిస్తున్నారు. అందుకు కారణం అన్ని ఉపనిషత్తులలోను చెప్పబడ్డ జ్ఞానం అంతా ఈ దశోపనిషత్తులలో నిక్షిప్తం చేయబడి ఉండటమే. అవే ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక అనేవి. ఈ పది ఉపనిషత్తులు ఏంతో ప్రాధాన్యత కలిగినవి కనుకనే శంకరాచార్యుల వారు ఈ పది ఉపనిషత్తులకు భాష్యం వ్రాశారు. అంతేగాదు, శంకరాచార్యుల వారిలాగానే ఆ తర్వాత వచ్చిన రామానుజాచార్యుల వారు, మధ్వాచార్యుల వారు కూడా ఈ దశోపనిషత్తులకు వారి వారి సిద్ధాంతాన్ని అనుసరించి భాష్యం వ్రాయటం జరిగింది. దీనిని బట్టి ఈ దశోపనిషత్తులు ఎంత ముఖ్యమైనవో మనం గ్రహించవచ్చు.

- ఇక -

'ఉపనిషత్తు' అనే పదం మన చెవిన పడగానే ఒక సుందరమైన, మనోహర దృశ్యం మన మనోఫలకంపై కదలాడుతుంది.



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

ప్రశాంతమైన ఒక వనవాటిక, పచ్చని చెట్లతో కళకళలాడుతున్న సుందర ప్రదేశం అది. అక్కడ చెట్లపై గల పక్షుల కిలకిలా రావాలతోను, కోకిలల కుహూ కుహూ అనే కూజితాలతోను మనస్సుకెంతో ఆహ్లాదం కలుగుతున్నది. బ్రహ్మచారుల వేద పఠనాలతో ఆ ప్రదేశమంతా పవిత్రతను సంతరించుకున్నది. ఆ ఆశ్రమ ప్రాంగణంలో ఒకచోట పెద్ద రావిచెట్టు. ఆ చెట్టు మొదలు వద్ద ఒక ఎత్తైన అరుగు. ఆ అరుగుపై ఉచితాసనం. దాని కెదురుగా సమీపంలో శుభ్రం చేసిన నేలపై దర్భాసనాలు వేసుకొని సాధన చతుష్టయ సంపన్నులైన శిష్యులు వినయ విధేయతలతో గురుదేవుల అమృత మయమైన వాక్కుల కొరకు ప్రభాత వేళలో, ప్రశాంత మనస్కులై ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. సరియైన వేళకు శోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు, కరుణా సముద్రుడు ఐన సద్గురువు తన ఆసనంపై ఆశీనులైనారు. శిష్యులు నిలబడి తమ తమ స్థానాలలో మౌనంగా కూర్చున్నారు. శాంతి మంత్రాన్ని పఠించి గురువు శాస్త్రాన్ని అనర్గళంగా, తన అనుభవాన్ని జోడించి ప్రవచనం చేస్తుంటే శిష్యులు నిశ్శబ్దంగా, ప్రశాంత మనస్సుతో, సూక్ష్మ బుద్ధితో తత్త్వాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఇదీ ఉపనిషత్తు అనే పేరు చెవిన బడటంతో కళ్ళ ముందు కదలాడే అద్భుత దృశ్యం.

ఎందుకీ దృశ్యం కళ్ళ ముందు కదలాడుతుంది?

ఈ దృశ్యం అంతా 'ఉపనిషత్తు' అనే పదంలో అంతర్లీనంగా దాగి ఉన్నది. ఎందుకంటే-



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

'ఉప' అంటే సమీపంగా,

'ని'అంటే క్రింద,

'షత్'అంటే కూర్చొనుట.

కనుక ఉపనిషత్ అంటే గురుదేవునికి సమీపంగా శిష్యులు క్రింద కూర్చొనుట అని. దీనిని బట్టి ఉపనిషత్తుల జ్ఞానాన్ని గురు సమ్ముఖంలో కూర్చొని, విని తెలుసుకోవలసిందే గాని, ఎవరింటిలో వారు కూర్చొని న్యూస్ పేపరు తిరగేసినట్లు తిరగేసేది కాదు. ఎందుకంటే ఇది ఆత్మవిద్య - బ్రహ్మవిద్య. ఈ విద్య మానవులలోని అజ్ఞానాన్ని పోగొట్టి, సమస్తమైన దుఃఖాలను నివృత్తి చేసి, పరబ్రహ్మాన్ని ఎరుకపరచి, ముక్తిని ప్రసాదిస్తుంది. ఈ కనిపించే ప్రపంచానికంతటికీ ఆధారమేదో, అధిష్టానమేదో, మూల కారణమేదో తెలియజెప్పి, అది నీలోనే ఉన్నదని చెప్పి, చివరకు అది నీవేనని చెప్పి, నీవు తప్ప రెండవదేదీ లేదని చెప్పి, స్వస్వరూప జ్ఞానాన్ని కలిగించేదే ఈ వేదాంతవిద్య – బ్రహ్మవిద్య - ఉపనిషత్ విద్య. అందుకే సాధన చతుష్టయ సంపన్నులైన సాధకులు శాస్త్రజ్ఞానము, అనుభవ జ్ఞానము గల కరుణామూర్తియైన సద్గురువును ఆశ్రయించి, ఆయనను పూజ్య భావంతో సేవించి, ఆయనకు సమీపంగా క్రింద కూర్చొని మాత్రమే వినయంతో, శ్రద్ధతో ఈ జ్ఞానాన్ని అందుకొనుటకు ప్రయత్నిస్తుంటారు.

అయితే ఈ పదాల యొక్క అర్థాలను లోతుగా విశ్లేషించి తెలుసుకోవాలి. 'సమీపంగా'అంటే గురువుకు బాగా దగ్గరగా ఆనుకొని కూర్చోమని కాదు. గురువు యొక్క మనోభావాలను సరిగ్గా గ్రహించి ఆయన ఆలోచనలకు అనుగుణంగా



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

నడుచుకోవాలి - ఆయన మనస్సుతో నీ మనస్సును అనుసంధానం చేయాలి - అని భావం. ఇక 'క్రింద' అంటే మోకాళ్ళు వంగకపోయినా, చచ్చినట్లు వంచి క్రింద కూర్చోమని కాదు. తాను ఎంతటి తెలివైనవాడైనా గురువు తన కన్నా ఎక్కువ తెలిసినవాడని, ఉన్నతుడని భావించి, ఆయన నుండి తాను జ్ఞానాన్ని గ్రహించాలని, అందుకై వినయంతో, విధేయతతో ఉండాలని భావం. గంగ ఎప్పుడూ ఎత్తు నుండి క్రిందకు(పల్లానికి) ప్రవహిస్తుంది. అలాగే జ్ఞాన గంగ కూడా ఉన్నతులైన జ్ఞాన సంపన్నుల నుండి అజ్ఞానంలో ఉన్నవారికి చేరాలి. అందుకే గురువు కన్న క్రిందుగా - అంటే గురువు కన్న నేను తక్కువ తెలిసిన వాడిని, జ్ఞానాన్ని అందుకోవలసినవాడిని అనే భావంతో ఉండాలి. 'కూర్చొనుట' అనటంలో నిలబడిగాని, అటూ ఇటూ తిరుగుతూ గాని నేర్చుకొనేది కాదు ఈ ఉపనిషత్తు జ్ఞానం అని బాహ్యార్థం. అయితే అసలయిన అర్థం ఏమంటే - మనస్సు ఏవేవో అల్పమైన విషయాలలో, ప్రాపంచిక విషయాలలో, భోగాలలో తిరగకుండా - గురువాక్యాల యందే - జ్ఞానమునందే స్థిరంగా నిలిచియుండాలి అని. ఇలా ఉపనిషత్ అనే పదంలోనే ఎన్నో రహస్యార్థాలు ఇమిడి ఉన్నాయి. మహాత్ములైన వారు తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్నిస్తారు. వాక్ శక్తిని వృథా చేసుకోరు.

ఉపనిషత్తులన్నీ వేదాలకు అంతంలో ఉన్నాయని, అందుకే వాటిని వేదాంతం అంటారని ఇంతకు ముందే తెలుసుకున్నాం. నిజంగా చాలా ఉపనిషత్తులు వేదాలకు అంతంలోనే ఉన్నప్పటికీ కొన్ని ఉపనిషత్తులు మాత్రం వేదాలలోని మొదటి భాగమైన సంహిత [మంత్రభాగం] లోను, రెండవ భాగమైన

బ్రాహ్మణాలలోను, అలాగే కొన్ని మూడవ భాగమైన ఆరణ్యకాలలో కూడా ఉన్నాయి.

ఈ కైవల్యోపనిషత్తు దశోపనిషత్తులలోనిది కాదు. అయినా ముగ్గురు ఆచార్యుల దృష్టి దీనిపై పడింది. అందుకే దీనిపై ముగ్గురూ భాష్యాలు వ్రాశారు. దీనిని బట్టే దీని ప్రాధాన్యత తెలుస్తుంది. ఇది అధర్వణ వేదానికి చెందిన 24 మంత్రాలు గల చిన్న ఉపనిషత్తు. ఇందులో గురువు సాక్షాత్తు బ్రహ్మవిద్యకు ఆద్యుడైన బ్రహ్మ దేవుడు. శిష్యుడు అనేకమందికి జ్ఞాన బోధ చేసిన అశ్వలాయనుడు. గురుశిష్యులిద్దరూ అసాధ్యులు, అసామాన్యులు, అసాధారణ ప్రజ్ఞా పాటవాలు కలిగినవారు. విషయమేమో కైవల్యమార్గం. ఇది చక్కని శైలితో; మోయలేనంత శబ్దజాలం, ఆర్భాటం లేకుండా; అంత కష్టం గాని భాషతో; ఛందోబద్ధమైన పదజాలంతో, అధిక ప్రసంగం లేకుండా; సూటిగా చెప్పబడ్డ వేదాంతం. కనుక ఈ ఉపనిషత్తును జాగ్రత్తగా అధ్యయనం చేసి ధన్యులమౌదాం.

'ఉపనిషత్తు' అనే శబ్దాన్ని చెవులారా వినటం కూడా పూర్వ జన్మ సుకృతమే. అలాంటిది ఒక ఉపనిషత్తును మంత్రాలతోను, వాటి అర్థాలతోనూ తెలుసుకోవటం గొప్ప అదృష్టం. ఇక ఆ ఉపనిషత్తులో చెప్పబడ్డ జ్ఞానాన్ని ఆమూలాగ్రంగా, కూలంకషంగా అవగాహన చేసుకోవటం ఇంకా ఇంకా అదృష్టం. ఇక ఉపనిషత్తులో బోధించబడ్డ జ్ఞానాన్ని సంపూర్ణంగా గ్రహించి, జీవితంలో ఆచరించి, అందుకనుగుణంగా జీవన విధానాన్ని మలుచుకోవటం అనేక జన్మల సుకృతం వల్లనే సాధ్యమౌతుంది. అట్టి వారినే మహాత్ములుగా, మహా పురుషులుగా


Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

పరిగణించటం జరుగుతున్నది. అలా సంపూర్ణంగా ఉపనిషత్తును అర్థం చేసుకొని, ఆచరించుటకు వీలుగా - ఎంతో వివరంగా, ఉపమానాలతో సహా సులభమైన వాడుక భాషలో చెప్పటం జరిగింది ఈ గ్రంథంలో. ఉపనిషత్తులోని మంత్రాలను చదవటం అంటే వేద పారాయణ చేయటమే. ఇక ఉపనిషత్తును చదవటం, వినటం, తెలుసుకోవటం అంటే వేదాధ్యయనం చేయటమే. ఆవిధంగా దీనిని చదివి అర్థం చేసుకున్నట్లయితే అధర్వణ వేదాన్ని అధ్యయనం చేసినట్లే. ఇలా చేసినందువల్ల మన శరీరం, వాక్కు, మనస్సు, బుద్ధి - అన్నీ పవిత్రమైపోతాయి. మాంసమయమైన శరీరం మంత్రమయం అవుతుంది. ఇక తెలుసుకోవటం, అర్థం చేసుకోవటం మాత్రమే గాక ఆచరణలో పెడితే, ఇందులో చెప్పిన లక్ష్యాన్ని చేరుకుంటే జీవన్ముక్తియే.

ఈ జ్ఞాన గంగలో మునిగి పునీతులమవుదాం. ఈ లభించిన మానవ జన్మను సార్థకం చేసుకుందాం.

శాంతి మంత్రంతో ప్రారంభించి ఉపనిషత్తులోనికి ప్రవేశిద్దాం. జ్ఞాన సాగరంలో మునకలు వేద్దాం. అమూల్యమైన జ్ఞాన రత్నాలను సంపాదించుకొని ఈ మానవ జన్మను సార్థకం చేసుకొందాం. అందుకు ఆ పరమాత్మ మనందరిపై తన అనుగ్రహ వర్షాన్ని కురిపించాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ –

- దేవిశెట్టి చలపతిరావు, గ్రంథ వ్యాఖ్యాత.

Sample : WWW.SRICHA



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

## శాంతి మంత్రము

**మంత్రం:- ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః ।**

**భద్రం పశ్యేమాక్ష భిర్య జత్రాః ।**

**స్థిరై రంగైస్తుష్టువాంసస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః ।**

**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః । స్వస్తినః పూషా విశ్వవేదాః ।**

**స్వస్తి నస్తార్ క్ష్యో అరిష్టనేమిః । స్వస్తినో బృహస్పతిర్దధాతు**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

**ప్రతి :-** ఓం = నిరాకార నిర్గుణ పరమాత్మ; దేవాః = దేవతలారా; కర్ణేభిః = మా చెవులతో; భద్రం = మంగళకరమైన శబ్దాలను; శ్రుణయామ = వినెదము గాక; యాజత్రా = పూజింపదగిన దేవతలారా; అక్షభిః = మా కన్నులతో; భద్రం = మంగళకరమైన దృశ్యాలనే; పశ్యేమ = చూచెదను గాక; స్థిరైః అంగైః = దృఢమైన అవయవాలతో; తనూభిః = ఆరోగ్యంగా ఉండి; తుష్టువాంసః = మిమ్ము స్తుతిస్తూ; యదాయుః = ఆయుష్షు ఉన్నంతవరకు; దేవహితం = దైవకార్యాలను చేస్తూ; వ్యశేమ = జీవించెదము గాక; వృద్ధశ్రవాః = అధిక కీర్తి గల వాడైన; ఇంద్రః = ఇంద్రుడు; నః స్వస్తి = మాకు శుభమును కలిగించుగాక; విశ్వ వేదాః = సర్వము తెలిసిన వాడైన; పూషా = సూర్యుడు; నః = మాకు; స్వస్తి = శుభమును కలిగించు గాక; అరిష్టనేమితార్క్ష్య = వేగముగా పోయే గరుడుడు; నః స్వస్తి = మాకు శుభమును కలిగించుగాక; బృహస్పతి = బృహస్పతి; నః స్వస్తి = మాకు

SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

శుభమును; దధాతు = కలిగించుగాక; ఓం శాంతిః శాంతిః శాంతిః = ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

**తాత్పర్యము :-** ఓ దేవతలారా! మేము సదా మంగళకరమైన వాక్కులనే విందుము గాక ! కళ్ళతో సదా మంగళకరమైన విషయములనే చూచెదముగాక, ధృఢమైన అవయవాలతో ఆరోగ్యంగా ఉండి మిమ్ము స్తుతిస్తూ మాకు విధించిన ఆయుష్కాలం వరకు జీవించెదముగాక. పురాతనుడు ప్రసిద్ధుడు, అధిక కీర్తి గలవాడు అయిన ఇంద్రుడు, సర్వమును తెలిసిన సూర్యుడు (పూషా); మిక్కిలి వేగము గల గరుడుడు, మాలోని ఆధ్యాత్మిక సంపదను రక్షించే బృహస్పతి వీరందరు మాకు విషయమును గ్రహించగల బుద్ధి కౌశల్యమును, వాటిని అనుసరించగల గుండె ధైర్యమును ఇచ్చి అనుగ్రహింతురు గాక. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

**వ్యాఖ్య :-** ప్రతి ఉపనిషత్తుకు ఒక శాంతిమంత్రం ఉంటుంది. ఉపనిషత్తును ప్రారంభించబోయే ముందు గురుశిష్యులిరువురూ తప్పక దీనిని చదువుతారు. శాంతి మంత్రంలో భగవంతుని ప్రార్థించటం ఉంటుంది. వేడికోలు ఉంటుంది. అంతా శుభం జరగాలనే శుభకామన ఉంటుంది.

ప్రతిజీవి యదార్థంగా పరమాత్మే. అంతటా ఉన్న చైతన్య స్వరూపమైన పరమాత్మ తనను తాను మరచి ఈ దేహాలలో కూర్చొని దీనితో తాదాత్మ్యం చెంది జీవుడై దుఃఖాలు పడుతున్నాడు. ఇప్పుడు జీవ భావాన్ని

Sample.WWW.chalapathirao.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

వదిలించుకొని తన స్వస్వరూపంలో - పరమాత్మ రూపంలో నిలిచిపోవాలి. దాని కొరకే ఈ ఉపనిషత్తు అధ్యయనం.

ఈ ఉపనిషత్తును గురువు చక్కగా బోధించాలన్నా, శిష్యులు చక్కగా విని అర్థం చేసుకోవాలన్నా, వారి అవయవాలు పుష్టిగా, తుష్టిగా ఉండాలి. ఇరువురి మధ్య ప్రేమ, వాత్సల్యం, అభిమానం ఉండాలి. వారి మనస్సులు అన్యోన్యం అనుకూలంగా ఉండాలి. బుద్ధి ప్రసన్నంగా ఉండాలి. వాక్కు శుద్ధంగా, స్పష్టంగా ఉండాలి. చుట్టూరా ఉన్న వ్యక్తులు, వాతావరణం ఎంతో అనుకూలంగా ఉండాలి. ఇవన్నీ చక్కగా అనుకూలంగా ఉండాలంటే సర్వశక్తిప్రదాత అయిన పరమాత్మ యొక్క అనుగ్రహం తప్పకుండా ఉండాలి. అందుకే ఆయనకు ముందుగా ప్రార్థన. ఈ ప్రార్థన చేసేటప్పుడు మనస్సులో కర్తవ్యం పట్ల దీక్ష, పరమాత్మను చేరుకోవాలనే పట్టుదల, భగవంతునిపై అచంచల భక్తి, విశ్వాసం, ఏ కల్మషాలు, మలినాలు లేని నిర్మలత్మం, ఏకాగ్రత ఉండాలి. ఉపనిషత్తులలో మనకు కనిపించే గురువులు పరమాచార్యులు. వారికి ఈ ప్రపంచం దుఃఖ పూరితమని తెలుసు. సారం లేనిదనీ తెలుసు. అందుకే ఇందులోని మానవులంతా ఈ దుఃఖం నుండి శాశ్వతంగా విముక్తి పొంది ఆనందసామ్రాజ్యంలో నిలవాలని భావించారు. దానికి అనేక మార్గాలు కనిపెట్టారు. ఆ మార్గాల వెంట శిష్యులను నడిపించటానికి ప్రయత్నాలు చేశారు. ఆ మార్గాలలో నడుస్తున్నప్పుడు దారిలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించటానికి ప్రయత్నాలు చేశారు. అందులో మొదటి ప్రయత్నమే ఈ శాంతిమంత్రం.

SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణించే సాధకులకు ఎదురయ్యే ఆటంకాలు ఏమిటి? శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే విషయాలే. ప్రపంచం ఈ విషయాలతో కూడుకొనే ఉంటుంది. ప్రపంచంలోని ఈ 5 విషయాలకు సంబంధించిన జ్ఞానాన్ని లోపలకు చేరవేసే వాకిళ్ళే మనకున్న 5 జ్ఞానేంద్రియాలు. చెవి శబ్దాన్ని విని మనస్సుకు చేరవేస్తుంది, చర్మం స్పర్శ విషయాన్ని చేరవేస్తుంది. కన్ను దృశ్యాలను, రూపాలను మనస్సుకు చేరవేస్తుంది, నాలుక రుచికి సంబంధించిన విషయాన్ని, ముక్కు వాసనకు సంబంధించిన విషయాన్ని మనస్సుకు చేరవేస్తుంది. ఇలా ఎప్పుడైతే బయటనున్న విషయాలు లోపల మనస్సుకు చేరాయో - వెంటనే మనస్సు విష పూరితం అవుతుంది, కలుషితం అవుతుంది. దానితో మనస్సు తన సహజ ప్రశాంత స్థితిని, ఆనంద స్థితిని కోల్పోతుంది. ఆందోళన, ఉద్రేకం, ఆలోచన, ఆవేశం, ఆక్రోశం అన్నీ ముసురుకొని మనస్సు అతలాకుతలమవుతుంది. అట్టి మనస్సును మళ్ళీ తన స్వస్థితిలో, నిర్మల స్థితిలో ఉంచాలంటే ఈ జ్ఞానేంద్రియాల ద్వారా మంగళకరమైన విషయాలు అంటే శబ్దాలు - దృశ్యాలు లోనికి చేరాలి.

అజామిళుడు గొప్ప వంశంలో జన్మించాడు. ధార్మికుడు, సద్బ్రాహ్మణుడు. అయినా ఒక్క దృశ్యాన్ని చూడటంతో నీచమైన జీవితాన్ని గడపాల్సి వచ్చింది. అలాగే నీచమైన మాటలు విని చెడినవాళ్ళు ఎందరో. రావణుడు సీతా దేవి సౌందర్యాన్ని గూర్చి విన్నాడు. అంతే. పతనమయ్యాడు - ఈ లోకంలో రోజూ మనం చూడకూడని వినకూడని ఎన్నో దృశ్యాలు చూస్తున్నాం. ఎన్నో మాటలు వింటున్నాం —

WWW.SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

అందుకే ఈ శాంతి మంత్రంలో "మేము సదా మంగళకరమైన వాక్కులనే విందుము గాక ! కన్నులతో మంగళకరమైన, పవిత్రమైన దృశ్యాలనే చూచెదము గాక !"అని దేవతలను ప్రార్థించటం జరిగింది. అంతేగాక తమ శరీర అవయవాలు, శరీరం తుష్టిగా - పుష్టిగా, ఆరోగ్యంగా ఉండాలని, ఈ దేహేంద్రియాలతో తృప్తిగా దేవహితం చేస్తూ జీవించాలని, అదీ ఆయువు ఉన్నంత వరకూ అలా దైవ కార్యాలలో నిమగ్నం కావాలని ప్రార్థిస్తున్నారు.

దీనిని బట్టి మనకొక విషయం అర్థమౌతుంది. ఈ ప్రపంచాన్ని వదిలి ఎక్కడికో వెళ్ళి సన్యాస జీవితాన్ని గడపాలనే కోరిక లేదు. ఈ ప్రపంచంలో జీవిస్తూనే తమ లక్ష్యాన్ని సాధించాలనే కోరిక మాత్రమే. అలాగే సాధనకు అంతరాయం కలగకుండా తమ ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకోవాలని, అందుకు భగవంతుని కృప కావాలని ఆరాటం. ఈ లోకంలో జీవిస్తూ - అవసరాలు తీర్చుకుంటూ, అందుబాటులోనున్న వాటిని అనుభవిస్తూ, కోరికలను తీర్చుకుంటున్నప్పటికీ - ఈ కోరికలను ఇంకా ఇంకా తీర్చుకోవాలనిగాని, ఇంకా ఇంకా భోగాలనుభవించాలనిగాని, అందుకోసం జీవితాన్ని పొడిగించుకోవాలని గాని కోరుకోవటం లేదు. అలాగని జీవితము అసంతృప్తిగా ఉంటే ముగించుకోవాలనీ లేదు. మరి? భగవంతుడు ఎంతవరకైతే తమకు ఆయువును ప్రసాదించాడో అంతవరకు దేవహితం చేస్తూ - అంటే దైవకార్యాలు, శాస్త్ర విహిత కార్యాలు చేస్తూ దైవాన్ని ఉపాసిస్తూ మోక్షప్రాప్తి కొరకు సార్థకమైన జీవితాన్ని,

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

శుభ ప్రదమైన జీవితాన్ని గడపాలనే కోరిక మాత్రమే ఉన్నది. అందుకే 'యదాయుః' అన్నారు.

ఇలా ఎవరిని కోరుతున్నారు?

ఈ జీవిత కాలంలో ఇలా శుభాలు కలిగించమని ప్రత్యక్షంగా కొందరు దేవతలను వేడుకుంటున్నారు. ఎవరా దేవతలు? అధిక కీర్తి గలవాడు, ప్రసిద్ధుడు ఐన ఇంద్రుడు; విశ్వమంతా తెలిసిన పోషకుడైన సూర్య భగవానుడు; అత్యంత వేగశాలియైన గరుడుడు; ఆధ్యాత్మిక సంపదను రక్షించి బుద్ధికి ప్రచోదనం కలుగజేసే బృహస్పతి - వీరిని ప్రార్థిస్తున్నారు.

వేదకాలంలో ప్రకృతి శక్తులను పూజించేవారు. ఈ ప్రకృతి శక్తులే దేవతలు. దేవతలు అంటే ఇచ్చేవారు. డైరెక్టుగా ఇచ్చేది ఈ దేవతలే. దేవతలకు అధిపతి అయిన దేవేంద్రుడు జీవులకు సర్వాన్ని ఇచ్చి వారి వారి కోర్కెలు తీర్చేవాడు. సర్వ జీవులకు వెలుగును ప్రసాదించి, శరీరానికి, కంటికి ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష దేవుడు సూర్యభగవానుడు. జీవులకు కావలసిన శక్తిని ప్రసాదించేవాడు గరుడుడు, బుద్ధికి కావలసిన తెలివిని ప్రసాదించేవాడు బృహస్పతి. కనుకనే వీరంతా దేవతలు. [దానాత్ దేవః ].

భగవంతుని చేరుకొనే దాకా - ముక్తిని పొందేదాకా సాధకుడికి ఈ ప్రకృతి శక్తుల సహకారం, ఆశీర్వాదం కావాలి. మానవుని కన్నా ఈ శక్తులు ఎంతో బలమైనవి. అవి సాక్షాత్తు భగవంతునిచే ప్రసాదించబడినవి. భగవంతుని ప్రతిరూపాలు. భక్తితో వేడుకుంటే, సత్కార్యాల కొరకు నిస్వార్థంగా వేడుకుంటే



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

తప్పక వారి అనుగ్రహం లభిస్తుంది. అందుకే ప్రార్థన. 3 సార్లు శాంతిః శాంతిః శాంతిః అంటారు. ఉపనిషత్తులను అధ్యయనం చేసేటపుడు 3 రకాల విఘ్నాలుంటాయి. 1. ఆధిదైవిక = ఉరుములు, మెరుపులు, వర్షం, తుఫాను, 2. ఆదిభౌతిక = అగ్ని ప్రమాదాలు, యాక్సిడెంట్లు, జంతువుల వల్ల, మనుషుల వల్ల వచ్చేవి. 3. ఆధ్యాత్మిక = బద్ధకం, అవిశ్వాసం, భోగాసక్తి మొ|| వి. వీటి నుండి రక్షణకు 3 సార్లు శాంతిః శాంతిః శాంతిః అని చదువుతారు. ఇక ఉపనిషత్ అధ్యయనంలోనికి ప్రవేశిద్దాం.

## మొదటి మంత్రము

**మంత్రం :-** అధాశ్వలాయనో భగవంతం పరమేష్ఠినముపసమేత్యోవాచ -

**ప్రతి :-** అధ = అంతట; ఆశ్వలాయనః = అశ్వలాయనుడు! భగవంతం = భగవంతుడైన; పరమేష్ఠినం = బ్రహ్మను; ఉపసమేత్య = సమీపించి; ఉవాచ = పలికెను.

**తాత్పర్యం :-** అటుపిమ్మట (అనగా సాధన చతుష్టయ సంపత్తిని పొందిన వెనుక) అశ్వలాయనుడు భగవంతుడైన బ్రహ్మదేవుని సమీపించి ఇట్లు పలికెను.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

**వ్యాఖ్య :-** భారతీయ వేదాంత సాహిత్యం అంతా గురుశిష్య సంబంధాన్ని కలిగి ఉంటుంది. కొందరు శిష్యులు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని గ్రహించటానికి ఒక సమర్ధుడైన గురువును వెతుక్కుంటూ వెళ్ళి, ఆయనను ఆశ్రయించి, వేదాంత విద్యను నేర్చుకుంటారు. అందుకే ఇక్కడ అశ్వలాయనుడు సాక్షాత్తు బ్రహ్మదేవునే తన గురువుగా భావించి ఆయనను సమీపించాడు.

అశ్వలాయనుడు సామాన్య శిష్యుడు కాదు. ఆయన గొప్ప ఆచార్యుడు కూడా. ఎందరికో జ్ఞాన బోధ కావించినవాడు. ఆయన పేరు - ప్రసక్తి - ఋగ్వేదంలో కనిపిస్తుంది. ఈయన వ్రాసిన ఆశ్వలాయన సూత్రాలు హిందూ శాస్త్ర గ్రంథాలలో ప్రసిద్ధి గాంచినవి. ఆపస్తంభసూత్రాలు, జైమిని సూత్రాలు, వాత్స్యాయన కామసూత్రాలు- ఇలా అనేకమంది ఋషులు రచించిన సూత్రాలు శాస్త్ర గ్రంథాలలో ప్రసిద్ధి చెంది ఉన్నాయి. మరి ఇంతగొప్ప జ్ఞాని, ఆచార్యుడు అయిన అశ్వలాయనుడు జ్ఞాన పిపాసియై బ్రహ్మదేవుని వద్దకు ఎందుకు వచ్చినట్లు? - తాను తెలుసుకొని బోధిస్తున్న జ్ఞానం పరిపూర్ణమైనది కాదని, కైవల్యం అందుకోవటానికి తగిన పరిపూర్ణ జ్ఞానాన్ని పొంది తరించాలంటే సాక్షాత్తు బ్రహ్మవిద్యను తెలుసుకోవాలని; అందుకు బ్రహ్మదేవుడే తగిన గురువు అని భావించి ఆయనను ఆశ్రయించాడు. అంటే బ్రహ్మవిద్యను గురుముఖత తెలుసుకోవాలి అని గ్రహించాలి.

WWW.SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

ఇక ఈ బ్రహ్మవిద్యను బోధించిన గురువు సాక్షాత్తు భగవంతుడైన పరమేష్టి. ఆయన ఆధ్యాత్మిక విద్యాబోధనలో ప్రధముడు. ఆయన కన్న ముందుగా ఈ విద్యను బోధించినవారు లేరు. అందుకే ఇది 'బ్రహ్మవిద్య' అయింది.

ఈ మానవులను సృష్టించక ముందే ఆయన తన మనస్సును మథించి సనకసనందనాదులైన మానసపుత్రులను సృష్టించాడు. వారెప్పుడూ బాలకులే(జ్ఞానులు). వయస్సు పెరగదు(నిర్వికారులు). నగ్నంగా ఉంటారు(నిరుపాధికులు); నిత్య బ్రహ్మచారులు(బ్రహ్మంలో చరించేవారు). అట్టి మహాత్ములకు ప్రప్రధమంగా బ్రహ్మవిద్యను బోధించినవాడు బ్రహ్మదేవుడు. కనుక ఆయన ప్రధమాచార్యుడు. అట్టి ప్రధమాచార్యుని వద్దకు బ్రహ్మవిద్యను పొందటానికి వచ్చినవాడు శిష్యుడు అశ్వలాయనుడు. గురుశిష్యులిరువురు ఉన్నత స్థాయికి చెందినవారు. కనుక వారి మధ్య జరిగే సంభాషణ కూడా ఉన్నతమైనదే అయి ఉండాలి. కనుకనే ఈ ఉపనిషత్తుకు కైవల్యోపనిషత్ అనే పేరు పెట్టి ఉండాలి. అర్హతను పొంది, సూక్ష్మబుద్ధితో గ్రహిస్తే ఈ జ్ఞానం మనకూ జన్మసార్ధక్య హేతువుగా ఉంటుందనటంలో సందేహం లేదు. ఇక -

'అధ' అనే మంగళవాచకంతో ఈ ఉపనిషత్తు ప్రారంభమైంది. అధ అంటే అంతట - పిమ్మట - ఇక అని అర్ధం. అంటే 'ఉపనిషత్తును శ్రవణం చేయటానికి కావలసిన సాధనను పూర్తి చేసిన పిమ్మట' అని - లేదా 'సాధన చతుష్టయ సంపదను పొందిన పిమ్మట - అని. అశ్వలాయనుడు ఇప్పటికే సాధన చతుష్టయ సంపద కలిగినవాడు కనుక ఉపనిషత్తు శ్రవణానికి పూర్తి అర్హత కలిగినవాడే.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

అందుకే భగవంతుడైన బ్రహ్మదేవుని సమీపించి తన మనస్సులోని భావాన్ని వెలిబుచ్చుతున్నాడు. గొప్ప గొప్ప శాస్త్ర గ్రంధాలన్నీ 'అధ' తో ప్రారంభమౌతున్నాయి. బ్రహ్మ సూత్రాలు, జైమిని సూత్రాలు, కొన్ని వేదాంగాలు, ఉపనిషత్తులు అధతో ప్రారంభమైనవి. భగవద్గీత కూడా "అధవ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః" అంటూ ఆ శ్లోకం నుండే యదార్ధంగా గీత ప్రారంభమైనదని కొందరు పెద్దలు చెబుతారు. ఇలా 'అధ' అనే పదాన్ని మంగళ సూచకంగా శాస్త్ర గ్రంధాలలో ఉపయోగించారు. ఈ ఉపనిషత్తు కూడా అధతో ప్రారంభమైంది గనుక ఈ శాస్త్ర పఠనం మంగళప్రదం, శుభప్రదం, శ్రేయోదాయకం.

"ఇప్పుడు గురువును సమీపించి ఇలా అన్నాడు". గురువును శిష్యుడు సమీపించటం సనాతన సాంప్రదాయం. గురువును తమ ఇంటికి రప్పించుకోవటం ఇప్పటి అవసరం అయింది. గురువుపై నిజమైన భక్తి కలగాలంటే ఆయన వద్దకు శిష్యుడు వెళ్ళాలి. అదే సాంప్రదాయం.

మరి అశ్వలాయనుడు ఏమన్నాడో చూద్దాం.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9538858115

మావద్ద లభించే అన్ని పుస్తకముల వివరముల కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :
http://www.srichalapathirao.com/catalog

"కైవల్యఉపనిషత్తు (కైవల్యోపనిషత్తు)"గ్రంధంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు" చేసిన వ్యాఖ్య 150 పేజీలకు పైగా ఉన్న పుస్తకములు మా వద్ద లభించును

Ebooks మీరు DOWNLOAD చేసుకొనుటకు రూ.200/- లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే (courier ఖర్చులు అదనం కలిపి) ONLINE లో చెల్లించుటకు -

Click & Pay us through Paytm : Paytm
http://srichalapathirao.com/images/paytm_QR_WWWSRICHALAPATHIRAOCOM.png

లేదా

Pay us through Net Banking : HDFC BANK
http://srichalapathirao.com/PDFs/Bank.pdf

మీకు మరేదైనా సందేహం ఉంటే care@srichalapathirao.com కు ఈమెయిల్ పంపగలరు లేదా +91 80085 39770 OR +91 95388 58115 నంబర్లకు ఫోన్ చేయగలరు

అన్ని పుస్తకములను లేదా కొన్ని పుస్తకములను లేదా గురుముఖతా ప్రవచనములను (వీడియో ప్రవచనముల కొరకు) శ్రవణం చేయుటకు DVD, External Hard Disk లేదా Audio CD, Pen Drive కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :
http://www.srichalapathirao.com/catalog

Sample WWW.SRICHALAPATHIRAO.COM